సాక్షి వికారాబాద్

శనివారం । 20 । జనవరి । 2024



ప్రయోగానికి పరీక్షే!

వికారాబాద్ జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుకునే సైన్స్ విద్యార్థులకు ప్రయోగాలు కరువయ్యాయి. 8లో▸



ట్యాబ్లెట్ వికటించి

కాలం చెల్లిన ట్యాబ్లెట్లు వేసుకోవడంతోనే తమ కూతురు మృతిచెందిందంటూ బాధిత తల్లిదండ్రులు విలపించారు. 8లో▸



చీర కొంగు మెడకు బిగించి

వికారాబాద్ మండలం పులుమద్ది గ్రామ సమీపంలో జరిగిన ఓ మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. 8లో▸

న్యూస్‌రీల్

దరఖాస్తులకు నేడే ఆఖరు

తాండూరు టౌన్: తెలంగాణ ప్రభుత్వ గురుకులాల్లో ఐదవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు నేడే (శనివారం) చివరి తేదీ అని టీఎస్ ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్యామల శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో మాత్రమే సమర్పించాలన్నారు.

అక్షరాస్యతతోనే పేదరిక నిర్మూలన

ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి



అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

తాండూరు టౌన్: సంపూర్ణ అక్షరాస్యతతో పేదరికాన్ని తరిమికొడదామని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరు పట్టణ శివారులోని తెలంగాణ రాష్ట్ర మైనార్టీ గురుకుల పాఠశాలలో ఆన్‌లైన్ అడ్మిషన్ల రిజిస్ట్రేషన్ కోసం శుక్రవారం చేపట్టిన క్యాంపెయినింగ్‌కి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా మైనార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బడీడు పిల్లలు బడిలోనే ఉండాలని అన్నారు. నిరక్షరాస్యత వల్ల కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తుతాయని అన్నారు. చిన్నపిల్లలను పనిలోకి పంపించి వారి బంగారు భవిష్యత్‌ను నాశనం చేయవద్దని తల్లిదండ్రులకు సూచించారు. ప్రభుత్వం బాలబాలికల కోసం వేర్వేరుగా పూర్తి ఉచితంగా అన్ని వసతులతో కూడిన గురుకులాలను ఏర్పాటు చేసిందన్నారు. జినుగుర్తి మైనార్టీ బాలుర పాఠశాల ప్రిన్సిపాల్ గంగయ్య మాట్లాడుతూ.. రాజీవ్ కాలనీ సమీపంలోని మైనార్టీ బాలికల గురుకులంలో 51 సీట్లు, జినుగుర్తి గేట్ సమీపంలోని బాలుర గురుకుల పాఠశాలలో 51 సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

నష్టపరిహారం ఇప్పించండి

ఆర్డీఓకు బైపాస్ భూ బాధితుల వినతి



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసరావు

కొడంగల్ రూరల్: కొడంగల్ మున్సిపల్ పరిధితోపాటు పరిసర గ్రామాల రైతులతో ఆర్డీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ బి.విజయకుమార్ శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మహబూబ్‌నగర్–చించోళి జాతీయ రహదారి బైపాస్ రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు, ఇళ్ల స్థలాలతోపాటు పొలాలు కోల్పోతున్న బాధిత రైతులతో సమావేశం నిర్వహించారు. విస్తరణ పనుల్లో కోల్పోతున్న భూములకు సంబంధించి నష్టపరిహారం అందించాలని రైతులు కోరారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషిచేస్తామని అధికారులు తెలిపారు. ప్రజాప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

కాషాయ జెండా ఎగురవేస్తాం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి



వికారాబాద్ అర్బన్: అధిష్టానం ఎంతో నమ్మకంతో తనకు జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిందని.. వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా పనిచేస్తానని ఆ పార్టీ నూతన అధ్యక్షుడు కె.మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన వికారాబాద్‌లో మాట్లాడుతూ.. కరసేవకుడిగా తన జీవితాన్ని ప్రారంభించి బీజేపీలో మూడు దశాబ్దాలుగా పనిచేస్తున్నట్లు తెలిపారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, ఇతర రాష్ట్ర నాయకులు తనను గుర్తించినందుకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో నాయకులను, కార్యకర్తలను కలుపుకొనిపోతూ చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గంలో ఈసారి కాషాయ జెండా ఎగురవేస్తామన్నారు.

ఈఎంఆర్ఐలో ఉద్యోగాలు

అనంతగిరి: ఈఎంఆర్ఐలో ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేయుటకు అర్హులైన అభ్యర్థులు నేరుగా ఇంటర్వ్యూకి హాజరుకావాలని జిల్లా ప్రోగ్రాం మేనేజర్ వసంత్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు సికింద్రాబాద్‌లోని కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబర్ 80747 88396లో సంప్రదించాలన్నారు.

లక్ష్యం దిశగా అడుగులు

పన్నుల వసూలులో పంచాయతీ విభాగం దూకుడు

- ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే 68శాతం టార్గెట్ పూర్తి
- ఆన్‌లైన్ అనుమతులతో పెరిగిన పారదర్శకత
- నాన్‌ట్యాక్సెస్ విషయంలో ఆరోపణలు



పన్నులు వసూలు చేస్తున్న పంచాయతీ కార్యదర్శి

వికారాబాద్: జిల్లా పంచాయతీ విభాగం పన్నుల వసూళ్లలో దూకుడు ప్రదర్శిస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరం పూర్తవడానికి ఇంకా రెండు నెలలు మిగిలి ఉండగానే గ్రామ పంచాయతీలు పన్నుల వసూలులో టార్గెట్‌కు దాదాపు 68శాతానికి చేరువయ్యాయి. గతనెల వరకు 50 శాతం వసూళ్లకే పరిమితమైన యంత్రాంగం దూకుడు పెంచటంతో ప్రస్తుతం 68శాతానికి చేరుకుంది. ఉన్నతాధికారుల నిరంతర పర్యవేక్షణ, పన్నుల వసూలపై టార్గెట్లు, నిరంతర సమీక్షలు, పంచాయతీలకు అందుబాటులో పంచాయతీ కార్యదర్శులు తదితర సానుకూల అంశాలు పన్నుల వసూలులో త్వరితగతిన పురోగతి సాధించటానికి దోహదం చేస్తున్నాయి. అయితే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల విధులు లాంటివి లేకుంటే టార్గెట్‌కు మరింత చేరువగా వచ్చేవారమని అధికారులు పేర్కొంటున్నారు. ఇతర శాఖలపై పర్యవేక్షణ, పనిఒత్తిడి ఉన్నప్పటికీ పంచాయతీ కార్యదర్శులు వాటిని అధిగమించి పన్నుల వసూలులో పురోగతి సాధించారు. ఒరకంగా చెప్పాలంటే ముక్కు పిండి జిల్లాలో వసూలు చేస్తున్నారా..? అనేంతగా దూకుడును ప్రదర్శిస్తున్నారు.

ముందంజలో పూడూరు, పరిగి..

జిల్లాలో 566 గ్రామ పంచాయతీలు ఉండగా 1,76,212 నివాసాలు ఉన్నాయి. పంచాయతీలు, మండలాలవారీగా 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి (పన్నుల డిమాండ్) ఆధారంగా లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. జిల్లా మొత్తంలో ఈ ఆర్థిక సంవత్సరానికి గాను రూ.7,56,41,735 పన్నులు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో ఇప్పటివరకు రూ.5,14,52,016 అంటే టార్గెట్‌లో 68 శాతం వసూలు చేశారు. మరో రూ.2.41 కోట్ల ట్యాక్సులు వసూలు చేయాల్సి ఉంది. పన్ను వసూలులో పూడూరు మండలం 79 శా తం, పరిగి మండలం 77 శాతంతో ముందు వరు సలో ఉన్నాయి. యాలాల్ మరియు తాండూరు మండలాలు 59 శాతంతో వెనుకబడి ఉన్నాయి.

టార్గెట్ చేరుకుంటాం



జిల్లాలో పన్నుల వసూలు 68 శాతం దాటింది. నాన్ ట్యాక్సుల వసూలు విషయంలో కాస్త వెనకబడి ఉన్న మాట వాస్తవమే. ప్రస్తుతం గ్రామాల్లో రైతులకు పంటలు చేతికి వచ్చినందున పన్నులు చెల్లించేందుకు వారు ముందుకు వచ్చే అవకాశం ఉంది. దీంతో త్వరితగతిన టార్గెట్ చేరుకునే అవకాశం ఉంది. ప్రజలు పన్నులు సక్రమంగా చెల్లించినప్పుడే నాణ్యమైన సేవలు కూడా అందుతాయి. ఇదే సమయంలో జవాబుదారీతనం, భాగస్వామ్యం కూడా పెరుగుతుంది.

– తరుణ్‌కుమార్, డీపీఓ, వికారాబాద్

అనుమతులన్నీ ఆన్‌లైన్‌లోనే..

జీపీల సేవల్లో పారదర్శకత కోసం అన్ని అనుమతులను ఇప్పటికే ప్రభుత్వం ఆన్‌లైన్ విధానంలోకి తీసుకువచ్చింది. మొదట్లో కేవలం ఇళ్ల అనుమతులకు మాత్రమే ఆన్‌లైన్ సేవలందిస్తూ మిగతా అన్నిరకాల సేవలు ఆఫ్‌లైన్‌లోనే కొనసాగిస్తూ వచ్చారు. ప్రస్తుతం అన్నిరకాల సేవలు ఆన్‌లైన్ ద్వారానే అందిస్తున్నారు. ట్యాక్సులు మరియు నాన్ ట్యాక్సుల కింద గ్రామ పంచాయతీల వారీగా టార్గెట్ విధించుకుని పన్నుల వసూలు రూపంలో నిధులు సమకూర్చుకుంటున్నారు. ప్రధానంగా ఇంటి పన్నులు ట్యాక్సుల కిందకు రాగా పంచాయతీల రాబడిలో ఇవే సింహభాగం ఉంటాయి. ఇళ్ల అనుమతులు, జరిమానాలు, సంతల్లో తైబజార్ ద్వారా వచ్చే రాబడులు, వ్యాపార సముదాయాలకు విధించే జరిమానాలు, పన్నులు, అనుమతులు తదితర సేవల ద్వారా గ్రామ పంచాయతీలకు సమకూరే నిధులను నాన్‌ట్యాక్సుల కింద లెక్కిస్తారు. అయితే ఇంటి పన్నుల వసూలులో పారదర్శకత బాగానే కనిపిస్తుండగా నాన్ ట్యాక్సెస్ వసూలు విషయంలో ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యాపారుస్తులతో లోపాయికారిగా వ్యవహరిస్తూ ఫాంహౌస్‌లు, వ్యాపార సముదాయాలకు పన్నులు సక్రమంగా విధించటంలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. వసూలు విషయంలోనూ అంతంతగానే చొరవ చూపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఓటరు నమోదుకు సహకరించండి

- కలెక్టర్ నారాయణరెడ్డి
- రాజకీయ పార్టీలు, అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్: ఓటరు నమోదులో జిల్లా ఆదర్శంగా నిలిచేలా అందరూ పనిచేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో ఆయన అడిషనల్ కలెక్టర్ రాహుల్‌శర్మతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీలకు, జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. ఓటరు నమోదుపై నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో జిల్లా అధికారులు చురుకుగా వ్యవహరించాలన్నారు. ట్రాన్స్‌జెండర్లు, 90 ఏళ్లు పైబడిన ఓటర్ల గురించి ప్రత్యేక చొరవ చూపాలన్నా రు. ఓటరు నమోదు కోసం ఈనెల 20, 21వ తేదీల్లో స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు.

పార్టీలు సహకరించాలి

జిల్లాలో వందశాతం ఓటరు నమోదుకు రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమన్నారు. నియోజకవర్గాల వారీగా రాజకీయ పార్టీలకు ఓటరు జాబితా అందజేస్తామని తెలిపారు. బూత్‌లెవెల్‌లో ఏజెంట్లను నియమించుకుని అర్హత ఉండి ఓటరుగా నమోదు చేసుకోనివారిని గుర్తించి వారి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. మార్పులు చేర్పుల అవసరం ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలు పంపండి

వికారాబాద్ అర్బన్: కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి సోమవారం వరకు అందజేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిపై శాఖలవారీగా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఆస్పత్రికి వాటర్ ప్లాంట్, రెండు అంబులెన్స్‌లు, జనరేటర్ వంటి ఏర్పాట్లతో పాటు, అవసరమైన సిబ్బందికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి, జీపీ భవనాల నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. గురుకుల పాఠశాలలు, కళాశాలల భవనాల నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఉద్యానవన శాఖ ద్వారా రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు 50 ఎకరాల స్థల సేకరణ వారం రోజుల్లో పూర్తి చేయాలన్నారు. వ్యవసాయ శాఖకు సంబంధించి డిప్లొమా కళాశాల ఏర్పాటుకు నివేదికను అందించాలన్నారు. అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, ట్రైనీ కలెక్టర్ నారాయణ అమిత్, కొడంగల్ స్పెషల్ ఆఫీసర్ వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ తాండూరు కార్యాలయం గేటుకు పెట్టిన టులెట్ బోర్డు

29న ఎస్ఎంసీ ఎన్నికలు

వికారాబాద్ అర్బన్: జిల్లాలో ఎస్ఎంసీ ఎన్నికలకు సంబంధించి ఈనెల 29న ఓటింగ్ నిర్వహిస్తామని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రతి పాఠశాలలో ఎన్నికల నోటిఫికేషన్‌కు సంబంధించి నేడు (శనివారం) నోటీస్ ఇవ్వడంతో పాటు ఆయా పాఠశాలల్లో చదివేపిల్లల తల్లిదండ్రుల జాబితా కూడా అదేరోజు నోటీసు బోర్డులో ప్రదర్శించడం జరుగుతుందని అన్నారు. ఈనెల 22, 23 తేదీల్లో తల్లిదండ్రుల జాబితాపై అభ్యంతరాలను స్వీకరించడంతో పాటు వాటిని పరిష్కరిస్తామన్నారు. 24న తుదిజాబితా ఖరారు చేయడంతో పాటు ఆ జాబితాను పాఠశాలల నోటీసు బోర్డుపై ప్రదర్శిస్తామన్నారు. 29న ఎస్ఎంసీ చైర్మన్, సభ్యులకు సంబంధించి ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు ఓటింగ్ నిర్వహించి.. అదేరోజు ఫలితాలు వెలువరించడంతో పాటు మధ్యాహ్నం 2గంటలకు ఎస్ఎంసీ కమిటీ మొదటి సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

అద్దెకు ఇవ్వబడును

- బీజేపీ తాండూరు కార్యాలయానికి టులెట్ బోర్డు
- అసెంబ్లీ సీటు జనసేనకు ఇవ్వటంతో నేతల గుర్రు
- కొత్త కార్యాలయం వెతికే పనిలో 'కొండా' అనుచరులు

తాండూరు: జిల్లాలోనే బీజేపీకి బలంగా ఉన్న తాండూరు నియోజవర్గంలో పార్టీ కార్యాలయం మూతపడింది. ఇక్కడ పార్టీని నడిపించేందుకు సరైన నాయకుడు లేకపోవడంతో గతంలో అసెంబ్లీ టికెట్ ఆశించి భంగపడిన నాయకులు ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల ముందు కావాలనే పార్టీ కార్యాలయ భవనాన్ని ఖాళీ చేశారని స్థానికంగా చర్చ జరుగుతోంది. వివరాల్లోకి వెళ్తే.. తాండూరు పట్టణంలోని హైదరాబాద్ మార్గంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యు.రమేష్ కుమార్ ఆధ్వర్యంలో ఆ పార్టీ కార్యాలయ భవనాన్ని మూడేళ్ల క్రితం అందుబాటులోకి తీసుకొచ్చారు. నాటి నుంచి బీజేపీ కార్యకలాపాలన్ని ఈ భవనంలోనే కొనసాగుతూ వచ్చాయి. ఈ క్రమంలో గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో తాండూర్ బీజేపీ టికెట్ కోసం యు.రమేష్‌కుమార్, ఆ పార్టీ సీనియర్ నేత నరేష్ మహరాజ్‌తోపాటు మరికొందరు పోటీ పడ్డారు. అయితే నియోజవర్గానికి చెందిన వీరందరినీ కాదని జనసేన పార్టీకి చెందిన నాయకుడికి ఆ పార్టీ టికెట్ కేటాయించింది.

అసెంబ్లీ సీటు కేటాయింపు నుంచి అలక..

తాండూరులో అస్థిత్వం లేని జనసేన పార్టీ అభ్యర్థికి టికెట్ ఎలా ఇస్తారని అప్పట్లో పెద్ద రచ్చే జరిగింది. ఇదంతా మనసులో పెట్టుకున్న స్థానిక నేతలు రానున్న లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని తాండూరులో పార్టీ కార్యాలయాన్ని ఖాళీ చేసి వెళ్లిపోయినట్లు పుకార్లు షికార్లు చేస్తున్నాయి. దీంతో ప్రస్తుతం పార్టీ నేతలు వస్తే ఎక్కడ మీటింగ్‌లు నిర్వహించాలో కూడా తెలియని పరిస్థితి ఉంది. లోక్‌సభ ఎన్నికల కోసం వెంటనే కొత్త భవనాన్ని అద్దెకు తీసుకునేందుకు మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అనుచరులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. పాత భవనాన్ని ఖాళీ చేయడం వెనుక కారణాలు ఏంటనే వాటిపై ఆ పార్టీ నేతలు ఆరాతీస్తున్నారు.

ఆరుబయటే చదువులు

- నిలిచిన నూతన ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణ పనులు
- తరగతిగదులు సరిపోక అవస్థలు
- నూనత భవనం స్లాబ్ కిందనే బోధన
- ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు





అసంపూర్తిగా కళాశాల నూతన భవనం, (ఇన్‌సెట్‌లో) స్లాబ్ కింద పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

వికారాబాద్ అర్బన్: వికారాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తరగతిగదులు సరిపడా లేకపోవడంతో విద్యార్థులు ఆరుబయట, వరండాల్లో కూర్చొని పాఠాలు వినాల్సిన దుస్థితి నెలకొంది. ఇక్కడ గత పదేళ్లుగా ఇలాంటి పరిస్థితే ఉంది. ప్రభుత్వాలు మారుతున్నా విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడంపై నేతలు దృష్టి సారించడంలేదు. ఈ కళాశాలలో తెలుగు, ఉర్దూ మీడియం కలిసి సుమారు 500 మంది వరకు ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. వీరంతా గ్రామీణ, పేద కుటుంబాల నుంచి వస్తున్నవారే. ప్రస్తుతం కళాశాలలో ఏడు గ్రూపులు కొనసాగుతున్నాయి. తెలుగు మీడియంలో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, సీఈసీ, ఉర్దూ మీడియంలో బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సుల్లో విద్యార్థులు చదువుతున్నారు. మొత్తం 17 సెక్షన్ల వరకు ఉన్నాయి. ఈ లెక్కన 17 తరగతి గదులు కావాలి. కానీ ఇక్కడ కేవలం 6 గదులే ఉన్నాయి. దీంతో రెండు మూడు సబ్జెక్టులకు సంబంధించి ఒకే దగ్గర కూర్చోబెట్టి తరగతులు బోధిస్తున్నారు. తక్కువ మంది విద్యార్థులు ఉన్న బైపీసీ, హెచ్ఈసీ రెండో సంవత్సరం విద్యార్థులను వరండాల్లో, కాంపౌండ్ లోపల కూర్చోబెట్టి పాఠాలు చెప్పాల్సిన పరిస్థితి. కళాశాలకు సంబంధించి కొత్త భవనం అసంపూర్తిగా ఉండటంతో ఆ భవనం స్లాబ్ కింద కూర్చోపెట్టి పరీక్షలు నిర్వహిస్తున్నారు. చుట్టూ గోడలు లేకపోయినా అవే తరగతి గదులుగా భావిస్తూ విద్యార్థులు పాటాలు వింటున్నారు.

పనులు నిలిపివేసిన కాంట్రాక్టర్..

ప్రభుత్వ జూనియర్ కళాశాల పాత భవనం సరిపోవడం లేదని గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాత భవనం పక్కనే కొత్త భవనం నిర్మించేందుకు నిర్ణయం తీసుకుంది. కొత్త భవనం నిర్మాణానికి రూ.1.20 కోట్లు మంజూరు చేసింది. సంబంధిత కాంట్రాక్టర్ మొదట్లో పనులు వేగంగా చేపట్టడంతో స్లాబ్ లెవర్ వరకు తీసుకొచ్చారు. అయితే ఏడాది క్రితం అకస్మాత్తుగా పనులు నిలిపివేశాడు. సంబంధిత అధికారులు పనులు ఎందుకు నిలిపివేశారని కాంట్రాక్టర్‌ను ఆరా తీయగా ప్రభుత్వం ఇచ్చిన రూ.1.20 కోట్లు కేవలం స్లాబ్ వరకు మాత్రమే సరిపోతున్నాయని అదనంగా నిధులు ఇస్తేనే పనులు చేసే పరిస్థితి ఉందని తేల్చి చెప్పాడు. దీంతో సంబంధిత అధికారులు మిగతా పనుల పూర్తికి అవసరమైన నిధులు ఇవ్వాలని జిల్లాస్థాయి అధికారులు, నాయకులకు నివేదించినా పెద్దగా స్పందన లేకపోవడంతో గమ్మున ఉండిపోయారు. మరో రూ.కోటి వరకు నిధులు ఇస్తే కళాశాల భవనం పూర్తయ్యే అవకాశం ఉందని అక్కడి సిబ్బంది చెబుతున్నారు. ఈ భవనం పూర్తయితే తరగతి గదులకు, ల్యాబ్‌లకు కొరత ఉండదనే అభిప్రాయం విద్యార్థుల నుంచి వ్యక్తమవుతుంది.

నిర్మాణం పూర్తిచేయాలి



ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులతో పోటీ పడి చదవాలని ఉన్నా ఇక్కడ వసతులు లేకపోవడంతో సమస్యగా మారింది. కొన్ని క్లాసులు ఆరుబయట కూర్చొని వినాల్సి వస్తుండటంతో చాలా మంది కళాశాలకు వచ్చేందుకు ఆసక్తి చూపడం లేదు. ఇక్కడ చదువుకునే ప్రతి విద్యార్థి పేద కుటుంబానికి చెందిన వారే. నూతన భవన నిర్మాణానికి సరిపడా నిధులు కేటాయించాలి.

– రోహిత్, హెచ్ఈసీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల

స్పీకర్ దృష్టి సారించాలి



ప్రస్తుత కళాశాల పాత భవనం స్పీకర్ ప్రసాద్‌కుమార్ గారు మంత్రిగా ఉన్న సమయంలో పూర్తయ్యిందని మా సార్లు చెబితే తెలిసింది. ఇప్పుడు కూడా స్పీకర్ ప్రత్యేక దృష్టి సారించి కొత్త భవనాన్ని పూర్తిచేయాలి. ఒక్కో బెంచ్‌లో నాలుగు నుంచి ఐదు మంది విద్యార్థులం కూర్చుంటున్నాం. ఆరుబయట క్లాసులు జరుగుతున్నాయి. చిన్న వర్షం వచ్చినా, ఎండ ఎక్కువగా ఉన్నా ఇబ్బంది పడుతున్నాం.

– కరణ్, ఎంపీసీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల

ఆల్ ది బెస్ట్.. బల్‌రాం

- ప్రపంచ రెండో అతిపెద్ద మంచు పర్వతం ఎక్కనున్న గిరిజన బిడ్డ
- అమెరికాకు పయనం



బొంరాస్‌పేట: రక్తం గడ్డకట్టే 25హై ఆల్టిట్యూడ్‌లో సాగే మంచు పర్వతం ఎక్కే సాహసానికి పూనుకున్నాడు మన తెలంగాణ గిరిజన బిడ్డ. పర్వతారోహణంలో 2018లో గిన్నిస్‌బుక్ రికార్డు సాధించిన వికారాబాద్ జిల్లా ఉమ్మడి బొంరాస్‌పేట మండలం సత్తర్‌కుంటతండాకు చెందిన బల్‌రాం రాథోడ్ అమెరికా ఖండంలోని సౌత్ అర్జెంటినా దేశంలోని ప్రపంచంలో రెండవ ఎత్తైన మౌంట్ అకాంకగువా మంచు పర్వతం 6962 మీటర్లు(2,283ఫీట్లు) ఎక్కేందుకు ఇటీవల ఎన్నికయ్యాడు. 21 రోజుల పాటు మంచు పర్వతాల్లో సాగే ఈ ప్రయాణం కోసం శుక్రవారం శంషాబాద్ విమానాశ్రయం నుంచి బయలుదేరాడు. ఈ సాహసప్రయాణంలో విజయం సాధించి ప్రపంచంలో తెలంగాణ సత్తా చాటిచెప్పాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

భూ సర్వే చేపట్టాలి

షాబాద్: రాష్ట్రవ్యాప్తంగా భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం సర్వే చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని నాగర్‌గూడ కృష్ణ దేవాలయం ఆవరణలో శుక్రవారం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో భూ సమస్యలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ధరణి పేరుతో గత ప్రభుత్వం చేసిన తప్పులతో అనేక మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం వెంటనే భూముల సర్వే నిర్వహించాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాధవరెడ్డి, పాలమూరు జిల్లా కార్యదర్శి నరేందర్ రెడ్డి, మొయినాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి, షాబాద్, శంషాబాద్, కొందుర్గు, చౌదరిగూడ, షాద్‌నగర్ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు, భారతీయ కిసాన్ సంఘ్ సభ్యులు పాల్గొన్నారు.

'జీపీఎఫ్' వివరాలు తెప్పించండి

జెడ్పీ సీఈఓకు ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం నేతల వినతి

అనంతగిరి: వికారాబాద్ జిల్లా ఎస్టీయూ టీఎస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో ప్రచురించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను శుక్రవారం జెడ్పీ సీఈఓ జానకీరెడ్డితో కలిసి ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వికారాబాద్ జిల్లాలో విలీనమైన కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల ఉపాధ్యాయుల జీపీఎఫ్ అకౌంట్స్‌కు సంబంధించిన వివరాలను కూడా మహబూబ్‌నగర్ నుంచి తెప్పించాలని కోరారు. అనంతరం వారు డీఈఓ రేణుకాదేవితో కలిసి తమ సంఘం డైరీని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి ఎండీ. షరీఫ్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

సీఆర్టీల సమస్యలు పరిష్కరించండి



కమిషనర్‌ నర్సింహారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న నేతలు

కుల్కచర్ల: గిరిజన ఆశ్రమ పాఠశాలలలో పనిచేస్తున్న సీఆర్టీ(కాంట్రాక్ట్‌ రెసిడెన్సియల్‌ టీచర్స్‌)ల సమస్యలు పరిష్కరించాలని లంబాడ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గోపాల్‌ నాయక్‌, కుల్కచర్ల సర్పంచుల సంఘం అధ్యక్షుడు శంకర్‌ నాయక్‌ కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా సీఆర్టీ ఉపాధ్యాయులతో కలిసి ట్రైబల్‌ వెల్ఫేర్‌ కమిషనర్‌ నర్సింహారెడ్డి, ఏడీ సర్వేశ్వర్‌రెడ్డిలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏళ్ల తరబడి ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న సీఆర్టీలను ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని, నామమాత్రపు జీతాలే ఇస్తున్నారన్నారు. అవి కూడా నాలుగైదు నెలలకొకసారి ఇవ్వడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్యను వెంటనే పరిష్కారించి పనికి తగ్గ వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాజేందర్‌, దాస్యనాయక్‌, రాజు, శ్రీకాంత్‌ పాల్గొన్నారు.

ఫారెస్టు అధికారులకు జింక అప్పగింత



అధికారులకు జింకను అప్పగిస్తున్న పోలీసులు

దోమ : మండల కేంద్రంలోని హెచ్‌పీ గ్యాస్‌ గోదాం సమీపంలో శుక్రవారం జింక జనవాసాల్లోకి వచ్చింది. దాన్ని చూసిన శునకాలు వెంబడించాయి. గమనించిన స్థానికులు వెంటనే జింకను పోలీసులకు అప్పగించారు. ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వగా స్టేషన్‌కు వచ్చి జింకను ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం జింకను అడవిలోకి వదిలారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ సత్యనారాయణచారి, ఫారెస్ట్‌ సెక్షన్‌ ఆఫీసర్‌ హామి, బీట్‌ ఆఫీసర్లు బీమ్లా నాయక్‌, గౌతమి, పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలు చేపట్టిన ముగ్గురికి జైలు

యాచారం: పట్టా భూమిలో అక్రమంగా గోడలు నిర్మించినందుకు ముగ్గురికి ఇబ్రహీంపట్నం న్యాయస్థానం శుక్రవారం రెండు నెలల సాధారణ జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రూ.1,500 జరిమానా విధించింది. వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్బీనగర్‌కు చెందిన జనార్దన్‌ రెడ్డి 2018లో నందివనపర్తి గ్రామంలోని సర్వే నంబరు 360లో 9 ఎకరాల 6 గుంటల పట్టా భూమిని కొనుగోలు చేశాడు. అప్పట్లో ఆ భూమిలో నగరానికి చెందిన ఎండీ బషీర్‌, ఎండీ నజీర్‌, ఎండీ జహూర్‌లు అక్రమంగా గోడ నిర్మించారు. రైతు జనార్దన్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన యాచారం పోలీసులు పూర్తి ఆధారాలు సేకరించి ఇబ్రహీంపట్నం కోర్టుకు సమర్పించారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం శుక్రవారం ఎండీ బషీర్‌, ఎండీ నజీర్‌, ఎండీ జహూర్‌లకు రెండు నెలల సాధారణ జైలు శిక్షతో పాటు రూ.1,500 చొప్పున జరిమానా విధించినట్లు యాచారం సీఐ సైదయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

పహాడీషరీఫ్: ముందు వెళుతున్న కారును వెనుక నుంచి అతివేగంతో వచ్చిన మరో కారు ఢీకొట్టి పల్టీ కొట్టిన సంఘటన బాలాపూర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఆర్‌సీఐ ప్రధాన గేట్‌ వద్ద ముందు వెళుతున్న కారును వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు బలంగా ఢీకొట్టి అదుపుతప్పి రోడ్డు పక్కన పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు రానందున కేసు నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

ప్రయోగానికి పరీక్షే!

- ముందస్తు ప్రాక్టికల్స్‌ లేకుండానే ఫైనల్‌ ఎగ్జామ్స్‌ రాయనున్న విద్యార్థులు
- ప్రభుత్వ కళాశాలలో కొరవడిన రసాయనాలు, ల్యాబ్‌లు

వికారాబాద్‌ అర్బన్‌: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల్లో చదువుకునే సైన్స్‌ విద్యార్థులకు ప్రయోగాలు కరువయ్యాయి. ఎలాంటి ముందస్తు ప్రయోగాలు చేయకుండానే ప్రాక్టికల్‌ పరీక్షకు వెళ్లాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరి 1 నుంచి ఇంటర్మీడియట్‌ సెకండియర్‌ సైన్స్‌ విద్యార్థులకు ప్రాక్టికల్స్‌ నిర్వహించేందుకు తేదీలు ప్రకటించింది. దీంతో ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ప్రాక్టికల్స్‌ పరీక్షలపై ఆందోళన చెందుతున్నారు. దీనికి ప్రభుత్వ కళాశాలల్లో ల్యాబ్‌లు లేకపోవడమే కారణం. కొన్ని కళాశాలల్లో ల్యాబ్‌లు ఉన్నా రసాయనాల కొరత విద్యార్థులను వేధిస్తోంది. జిల్లాలో 9 ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలు ఉన్నాయి. వికారాబాద్‌, తాండూరు, పరిగి, మర్పల్లి, మోమిన్‌పేట్‌, నవాబుపేట్‌, పెద్దేముల్‌, కుల్కచర్ల, కొడంగల్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూపులు కొనసాగుతున్నాయి. ఇందులో సుమారు 1,800 మంది ఇంటర్మీడియట్‌ సెకండియర్‌ చదువుతున్నారు. ఎంపీసీ, బైపీసీలో 1,100 మంది విద్యార్థుల వరకు ఉన్నారు. వీరందరికి తప్పనిసరిగా ప్రాక్టికల్స్‌ నిర్వహించాల్సి ఉంటుంది.

నిధుల లేమి

జిల్లాలోని తొమ్మిది ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలకు సొంత భవనాలు ఉన్నాయి. ఒక వికారాబాద్‌ ప్రభుత్వ కళాశాల మినహా మిగతా ఎనిమిది కళాశాలల్లో సైన్స్‌ ల్యాబ్‌లకు ప్రత్యేక గదులు ఉన్నాయి. అయినా ప్రయోగాలు ఆశించిన మేర జరగడం లేదు. కెమిస్ట్రీ, బయోలజీ, ఫిజిక్స్‌ వంటి ప్రయోగాలకు అవసరమైన రసాయనాలు, పరికరాలు అందుబాటులో లేవు. ప్రభుత్వం గత ఆరేళ్ల క్రితం రసాయనాల కొనుగోలుకు అవసరమైన నిధులు ఇచ్చింది. కొన్ని కళాశాలల్లో వాటితోనే నేటికీ నెట్టుకొస్తున్నారు. కొన్ని చోట్ల కళాశాల నిర్వహణ డబ్బుల నుంచి వెచ్చించి రసాయనాలు కొనుగోలు చేసి ఏడాది గడిపేస్తున్నారు. అవసరమైన ల్యాబ్‌ గదులు ఉన్నా రసాయనాలు లేక ఏడాదిలో రెండు, మూడుసార్లు మాత్రమే ప్రయోగాలు చేయించి మమ అనిపిస్తున్నారు.

తాత్కాలిక ల్యాబ్‌లు

వికారాబాద్‌ ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో వసతులు, సామగ్రి, కెమికల్స్‌ కొరతతో ప్రయోగాలు నిర్వహించే పరిస్థితులు లేవు. సైన్స్‌ విద్యార్థులకు ప్రాక్టికల్స్‌ చేయించాలంటే తరగతి గదిని ఖాళీ చేయించి తాత్కాలికంగా ల్యాబ్‌ను ఏర్పాటు చేసుకొని ప్రయోగాలు చేయాల్సి వస్తోంది. తరువాత రసాయనాలను బీరువాలో భద్రపర్చుకోవాల్సిన దుస్థితి ఉంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ల్యాబ్‌లు ఏర్పాటు చేసి, సదుపాయాలు కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు.



వికారాబాద్‌ జూనియర్‌ కళాశాలలో బీరువాలో ఉంచిన రసాయనాలు

ఉన్నతాధికారులకు నివేదించాం



కళాశాలల్లో ల్యాబ్‌ గదులకు ఇబ్బంది లేదు. ఒక వికారాబాద్‌లోనే గదులకు కొరత ఉంది. ఏదో ఒక సమయంలో విద్యార్థులకు ప్రాక్టికల్స్‌ చేయించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రయోగాలకు అవసరమైన రసాయనాల కొరత నిజమే. ఉన్న వాటితోనే నిర్వహిస్తున్నాం. రసాయనాల కొనుగోలుకు ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం.

– శంకర్‌, ఇంటర్మీడియట్‌ జిల్లా నోడల్‌ అధికారి

అభివృద్ధికి చర్యలు

కొడంగల్‌లో అధికారుల పర్యటన

బొంరాస్‌పేట: కొడంగల్‌ ఏరియా డెవలప్‌మెంట్‌ అథారిటీ(కడా) కింద చేపట్టనున్న మండలాలు, గ్రామాల అభివృద్ధికి అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం మండల కేంద్రాన్ని పంచాయతీ రాజ్‌ శాఖ డీఈ నాగేశ్వర చారి, ఏఈ రవికిరణ్‌ పర్యటించారు. గ్రామపంచాయతీ గుర్తించిన పనులను అధికారులకు సర్పంచ్‌ జయమ్మ సూచించారు. మండల కేంద్రంలోని ఇన్‌స్పెక్షన్‌ బంగ్లా స్థలంలో సమీకృత వ్యాపార సముదాయ కేంద్రం నిర్మాణం చేసేందుకు అధికారులకు తెలిపారు. అవసరమైన అనుసంధాన రోడ్లు, అంతర్గత సీసీరోడ్లు, మురుగుకాల్వలు, కల్వర్టుల నిర్మాణానికి పరిశీలించి అవసరమైన చోటును అధికారులు గుర్తించారు. అలాగే బీసీ, ఎస్సీ, కమ్యూనిటీ హాళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు ప్రణాళికలు తయారు చేశారు. చేపట్టే పనులు నమోదు చేసుకున్నారు.

పర్యాటక కేంద్రంగా..

అలాగే గ్రామ శివారులో జాతీయ రహదారి పక్కన ఉన్న సంగాయిపల్లి గడ్డకు ఉన్న సంగమేశ్వర ఆలయం, కల్యాణమండపం, మైసమ్మగుడి, ఆంజనేయస్వామి ఆలయాల సముదాయంతోపాటు షాదుల్లా మహ్మద్దీయుల గుడిని నిర్మించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలనే ప్రణాళికలను అధికారులకు వివరించామని సర్పంచ్‌ తెలిపారు. వీరితోపాటు కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్‌, నాయకులు కిష్టప్ప తదితరులున్నారు.



పరిశీలిస్తున్న అధికారులతో నాయకులు

బడి ఎన్నికలకు మోగిన నగారా



బాలంపేట ఉన్నత పాఠశాల

- ఎస్‌ఎంసీ పోరుకు నోటిఫికేషన్‌
- 29న కొలువుదీరనున్న కమిటీలు
- విద్యార్థుల తల్లిదండ్రులకు పోటీచేసే అవకాశం

దౌల్తాబాద్‌: పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్‌ఎంసీ) ఎన్నికలకు నగారా మోగింది. ఈ మేరకు షెడ్యూల్‌ను రాష్ట్ర విద్యాశాఖ విడుదల చేసింది. ఈ నెల 29న పాఠశాల యాజమాన్య కమిటీల ఎన్నికలు జరగనున్నాయి. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో ఈ కమిటీలు కీలకపాత్ర పోషిస్తాయి. 2019లో ఎస్‌ఎంసీలు కొలువుదీరాయి. ఆ తర్వాత కోవిడ్‌ ప్రభావంతో పాత వాటినే కొనసాగించారు.

పాఠశాల అభివృద్ధికి కృషి

మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు , ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాల పంపిణీని ఎస్‌ఎంసీ చైర్మన్‌, వైస్‌చైర్మన్లు పర్యవేక్షిస్తారు. మన ఊరు–మన బడి పనుల పురోగతిని సమీక్షించాలి. మూత్రశాలల నిర్వహణ, శుద్ధనీరు, మైదానాలు క్రీడా సామగ్రి తదితర సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేయాలి. పాఠశాల నిర్వహణ నిధులు హెచ్‌ఎంలు, ఎస్‌ఎంసీ చైర్మన్‌ ఉమ్మడి ఖాతాలో జమవుతాయి. వీటిని సక్రమంగా వినియోగించేందుకు కృషి చేయాలి.

ఎన్నుకునే విధానమిలా..

జెడ్పీ, ప్రభుత్వ, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల్లో నిబంధనల ప్రకారం ఎస్‌ఎంసీ ఎన్నికలు నిర్వహించాలి. ప్రాథమిక పాఠశాలల్లో 10, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 14, ఉన్నత పాఠశాలల్లో 10 మంది సభ్యులతో కమిటీలను ఎన్నుకుంటారు. స్థానిక హెచ్‌ఎంల ఆధ్వర్యంలో ఎన్నికలు జరుగుతాయి. ఆరుగురు ఎక్స్‌ఫిషియో, ఇద్దరు కోఆప్షన్‌ సభ్యులుంటారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలల నిర్వహణలో భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో విద్యాహక్కుచట్టం ఎస్‌ఎంసీల ఏర్పాటుకు మొగ్గు చూపింది. సదరు బడిలో చదివే పిల్లల తల్లిదండ్రులే సభ్యులుగా కొనసాగుతారు. రెండేళ్లపాటు పదవిలో ఉంటారు. ఎప్పుడైనా వారి పిల్లలు పాఠశాలను వదిలివెళ్లినట్లయితే పదవి కోల్పోతారు. ఓటర్లలో 50శాతం మంది హాజరవకపోతే కోరం లేనట్లే. సభ్యులు చేతులెత్తే పద్ధతితో కమిటీని ఎన్నుకుంటారు.

రుణమా'ఫికర్‌'

- రైతుల్లో నెలకొన్న అనుమానాలు
- కొత్త ప్రభుత్వంపైనే ఆశలు

మోమిన్‌పేట: అన్నదాతలకు పంట రుణమాఫీపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ హయాంలో ఒకరికి వచ్చి, మరొకరికి రాకపోవడంతో గందరగోళానికి ఆస్కారం ఏర్పడింది. గతేడాది అక్టోబరులో ఎన్నికల కోడ్‌ రావడంతో రుణమాఫీని నిలిపివేశారు. ప్రస్తుతం పాలన పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్‌ ప్రభుత్వం డిసెంబరు 7 నుంచి రైతులు తీసుకున్న పంట రుణాలను రూ.2 లక్షల వరకు మాఫీ చేస్తామని ప్రకటించడంతో సందిగ్ధం నెలకొంది. ఇదివరకే ఎంపికైన వారికి వర్తింపజేస్తారా.. లేదంటే కొత్తగా కార్యాచరణ రూపొందిస్తారా.. అని ఆశావహులు ఎదురు చూస్తున్నారు. 2020 నుంచి రూ.25– రూ.50 వేల వరకు కొంత మంది రైతులకు 2022 వరకు రుణమాఫీ చేశారు. మళ్లీ 2023 ఆగస్టు 15 నుంచి సెప్టెంబరు నెలాఖరులోగా రుణమాఫీ పూర్తి చేయాలని అప్పటి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా అది పూర్తి స్థాయిలో అమలు కాలేదు. ఒక రైతుకు రూ.లక్ష మాఫీ అయింది.. ఇంకో రైతుకు కాలేదు. ఏ ప్రాతిపదికన రుణమాఫీ చేశారని రైతులు తలలు పట్టుకుంటున్నారు.



మోమిన్‌పేటలోని ఎస్‌బీఐ శాఖ

ఎన్నికల కోడ్‌ రావడంతో..

మండల కేంద్రంలోని యూనియన్‌ బ్యాంకులో అర్హత కల్గిన పంట రుణాల ఖాతాలు 3,235 ఉన్నాయి. అందులో అప్పటి వరకు 1,400 ఖాతాలకు మాత్రమే మాఫీ వర్తించింది. స్టేట్‌ బ్యాంకు ఆఫ్‌ ఇండియాలో 1,952 ఖాతాలుండగా 900 వాటికి మాఫీ జరిగింది. పీఏసీఎస్‌ మోమిన్‌పేటలో 1,373 పంట రుణ ఖాతాలకు రూ.4.02 కోట్ల మాఫీ కావాల్సి ఉండగా రూ.3.04 కోట్లు జమ అయ్యాయి. పీఏసీఎస్‌ మేకవనంపల్లిలో 1,082 ఖాతాలకు రూ.5.14 కోట్ల మాఫీకి రూ.4.01 కోట్లు జమ అయ్యాయి. ఎన్నికల కోడ్‌ రావడంతో పూర్తి రుణమాఫీ జరగలేదు. ప్రస్తుతం కాంగ్రెస్‌ ప్రభుత్వం ఏర్పడటంతో రూ.2 లక్షల రుణమాఫీపై రైతులకు ఆశలు చిగురిస్తున్నాయి. అప్పుడు రుణమాఫీకి అర్హత పొంది మాఫీ కాకపోవడంతో ప్రస్తుతం నష్టపోతున్నామని పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కొంత మందికి మాఫీ అయింది



యూనియన్‌ బ్యాంకులో 2017లోనే రూ.లక్ష పంట రుణం తీసుకున్నా. ఏటా రెన్యూవల్‌ చేయిస్తున్నా. రైతులకు ఇస్తున్నమంటున్నా పావల వడ్డీ రావడం లేదు. పూర్తి వడ్డీ చెల్లిస్తున్నా. రుణమాఫీ కాలేదు. అప్పట్లో రోజూ బ్యాంకుకు వెళ్లి అధికారులను అడిగాను. కొంత మందికి రూ.లక్ష మాఫీ అయింది. అంతా అయోమయంగా ఉంది. కాంగ్రెస్‌ ప్రభుత్వం పూర్తి స్థాయిలో మాఫీ చేస్తుందని ఆశిస్తున్నా.

– రాంచంద్రారెడ్డి, రైతు, ఎన్కేపల్లి

ఆలయ భూముల జోలికొస్తే చర్యలు

తాండూరు రూరల్‌: దేవాదయ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆ శాఖ అధికారి అనిత హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని అంతారం అనుబంధ గ్రామం దస్తగిరిపేట్‌(చంద్రగిరి)కి సంబంధించిన ఆలయ భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దస్తగిరిపేట్‌లోని శ్రీదేవి, భూదేవి వేంకటేశ్వరస్వామి ఆలయానికి చెందిన సర్వేనంబర్‌ 161, 162, 177, 179, 50లో మొత్తం 57 ఎకరాల భూమి దేవాదాయ శాఖకు చెందినదిగా గుర్తించామన్నారు. దీనికి సంబంధించి బోర్డును కూడా భూముల్లో ఏర్పాటు చేశారు. దేవాదాయ భూముల జోలికి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్‌ హరితాదేవి, ఇన్‌స్పెక్టర్‌ మధుబాబు, ఈవో శేఖర్‌గౌడ్‌, గ్రామస్తులు శ్రీను, అంబ్రేష్‌, అశన్న, మొగులప్ప, రజనీకాంత్‌, స్వామిదాస్‌ ఉన్నారు.



సూచిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

సెంటర్‌ ఆఫ్‌ ఎక్స్‌లెన్స్‌కు నేడే చివరి తేదీ

అనంతగిరి: వికారాబాద్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాలలో సెంటర్‌ ఆఫ్‌ ఎక్సలెన్స్‌లో 2024–25 విద్యా సంవత్సరం ప్రవేశం కోసం గడువు శనివారంతో ముగుస్తుందని ప్రిన్సిపాల్‌ అపర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో చేసుకోవాలన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని మృతదేహం

పహాడీషరీఫ్: ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని యాచకుడు మృతి చెందిన సంఘటన పహాడీషరీఫ్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పహాడీషరీఫ్‌లోని పండ్ల దుకాణాల సమీపంలో గురువారం గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండడంపై సమాచారం అందుకున్న పోలీసులు, అతన్ని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు వైద్యులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు(55) యాచకుడిగా పోలీసులు భావిస్తున్నారు. ముస్లిం వర్గానికి చెందిన మృతుని సంబంధీకులెవరైనా ఉంటే పహాడీషరీఫ్‌ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కేసు నమోదు చేసుకున్న పోలీసులు తెలిపారు.

టాబ్లెట్‌ వికటించి ఇంటర్‌ విద్యార్థిని మృతి



పోలీస్‌ స్టేషన్‌ ఆవరణలో బాధితులతో బేరసారాలు మాట్లాడుతున్న పోలీసులు

- కాలం చెల్లిన మందు బిల్లలు వేసుకుని తీవ్ర అస్వస్థతకు గురైన లక్ష్మి
- పరిగి ఆస్పత్రికి తరలిస్తుండగా అనంత లోకాలకు
- కన్నీరుమున్నీరుగా విలపించిన కుటుంబ సభ్యులు

దోమ: కాలం చెల్లిన ట్యాబ్లెట్లు వేసుకోవడంతోనే తమ కూతురు మృతిచెందిందంటూ బాధిత తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ సంఘటన మండల పరిధిలోని పాలేపల్లిలో శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శివనిగారి చంద్రయ్య, నర్సమ్మ దంపతులకు విష్ణు, లక్ష్మి(18) ఇద్దరు సంతానం. లక్ష్మి జాఫర్‌పల్లిలోని మోడల్‌ స్కూల్‌లో ఇంటర్‌ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. సంక్రాంతి పండుగ నేపథ్యంలో ఇంటికి వచ్చిన ఆమె స్వల్ప జ్వరంతో అస్వస్థతకు గురైంది. దీంతో కుటుంబ సభ్యులు బుధవారం దోమలోని ఆర్‌ఎంపీ డాక్టర్‌ శివరాం వద్దకు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యుడు మందులు రాసిచ్చాడు. మరుసటి రోజు వరకు కూడా ఆరోగ్యంలో ఏమాత్రం మార్పు లేకపోవడంతో గురువారం మళ్లీ అదే వైద్యుడిని సంప్రదించారు. ఈసారి వేరే మందులు రాసి ఇవ్వగా మెడికల్‌ షాపులో కొనుకోలు చేసి, వైద్యుడికి చూపించారు. సమయపాలన వివరాలు చెప్పిన ఆయన క్రమంతప్పకుండా వేసుకోవాలని సూచించారు. కానీ అందులో కాలం చెల్లిన ట్యాబ్లెట్లు ఉన్నాయని గమనించలేదు. వీటిని వేసుకున్న లక్ష్మి తీవ్ర అస్వస్థతకు గురైంది. దీంతో దోమలోని ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్లగా పరిస్థితి బాగా లేదని వెంటనే పరిగిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సూచించారు. పరిగికి తరలిస్తుండగానే బాధితురాలు మృతిచెందింది. తమ కూతురు మరణానికి కారణమైన ఆర్‌ఎంపీ వైద్యుడు, మెడికల్‌ షాపు నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని బాధితులు డిమాండ్‌ చేశారు.



కాలం చెల్లిన ట్యాబ్లెట్‌



లక్ష్మి (ఫైల్‌)

పోలీసులకు ఫిర్యాదు

లక్ష్మి మృతి చెందిన విషయాన్ని ఆమె కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కానీ పోలీసులు మాత్రం కేసు నమోదు చేయకుండా ఆర్‌ఎంపీ వైద్యుడు, మెడికల్‌ షాపు యజమానితో పాటు పలువురు నాయకులతో కలిసి స్టేషన్‌ ఆవరణలో పంచాయితీ పెట్టారని, తమతో బేరసారాలు చేశారని బాధితులు ఆరోపించారు. ఈ విషయమై ఎస్‌ఐ శ్రీశైలంను వివరణ కోరగా.. తాము ఎలాంటి బేరసారాలు చేయలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. కుటుంబ సభ్యుల ఒత్తిడి మేరకు ఎట్టకేలకు లక్ష్మి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

చీర కొంగు మెడకు బిగించి..

- మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు
- ప్రాణం తీసిన వివాహేతర సంబంధం

అనంతగిరి: వివాహేతర సంబంధం నిండు ప్రాణాన్ని బలికొంది. వికారాబాద్‌ మండలం పులుమద్ది గ్రామ సమీపంలో జరిగిన ఓ మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం జిల్లా ఎస్పీ కోటిరెడ్డి వికారాబాద్‌ పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ధారూరు మండలం రాజాపూర్‌కు చెందిన తలారి బాబు అలియాస్‌ అవుసుపల్లి బాబు పటాన్‌చెరు సమీపంలోని తెల్లపూర్‌లో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. చేవెళ్ల గ్రామానికి చెందిన ఎర్రోళ్ల అనుసూజ(35)కు భర్త ఐదేళ్ల క్రితం మృతి చెందాడు. ఈ క్రమంలో ఆమె పనిచేస్తున్న చోట మూడేళ్ల క్రితం బాబుతో పరిచయడం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారి తీసింది. బాబు ఆమెకు అవసరం ఉన్నప్పుడల్లా డబ్బులు ఇచ్చేవాడు. తిరిగి ఇవ్వాల్సిందిగా అతడు కోరాగా అందుకు ఆమె నిరాకరించింది. దీంతో వేరొకరితో అక్రమ సంబంధం పెట్టుకుందని అనుమానం పెంచుకొని అనుసూజను చంపడానికి బాబు నిర్ణయించుకున్నాడు.

మాయమాటలు చెప్పి

అనుసూజకు ఈ నెల 14న మాయమాటలు చెప్పి వికారాబాద్‌కు బాబు తీసుకువచ్చాడు. పులుమద్ది గ్రామ శివారు వద్ద మద్యం తాగారు. అక్రమ సంబంధం అనుమానంతో గొడవకు దిగి ఆమె ముఖంపై పిడిగుద్దులతో విరుచుకుపడి, చీర కొంగుతో మెడకు బిగించి హత్య చేశాడు. ఆమె మృతి చెందినదని నిర్ధారించుకుని పక్కనే ఉన్న చిన్న కాల్వలో పడేసి దహనం చేశాడు. మరుసటి రోజు ఉదయం గ్రామస్తులు పొలాలకు వెళ్లేటప్పుడు మృతదేహాన్ని గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. మృతురాలి సెల్‌ఫోను ఆధారంగా విచారణ ప్రారంభించారు. చివరగా బాబుతో మాట్లాడినట్లు గుర్తించారు. ఈ క్రమంలో అతడిని గురువారం రాత్రి అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించాడని ఎస్పీ తెలిపారు. 2016లో ఓ హత్య కేసులో వికారాబాద్‌ పీఎస్‌లో బాబుపై కేసు ఉందని వివరించారు. మృతురాలి వద్ద ఉన్న బంగారం(చెవికమ్మలు), కాళ్ల కడియాలు, సెల్‌ఫోన్‌ తీసుకెళ్లి కేసును పక్కదారి పట్టించే ప్రయత్నం చేశాడన్నారు. నిందితున్ని రిమాండ్‌ తరలిస్తామన్నారు. కేసును ఛేదించినందుకు ఏఎస్పీ రవీందర్‌రెడ్డి, డీఎస్పీ నర్సింలు, సీఐలు శీను, ఆంజనేయులు, ఎస్‌ఐలు సంతోష్‌, భరత్‌ భూషన్‌, అనితతో పాటు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ కోటిరెడ్డి

చెరువులో పడి వ్యక్తి గల్లంతు!



ఈశ్వర్‌గౌడ్‌ (ఫైల్‌)

కొత్తూరు: చెరువులో పడి ఓ వ్యక్తి గల్లంతయిన సంఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మరిగూడ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఈశ్వర్‌గౌడ్‌(47) గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆయన ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు రాత్రంతా వెతికారు. మరుసటి రోజు గ్రామ సమీపంలోని గోధుమకుంట చెరువు గట్టుపై ఆయన దుస్తులు కనిపించాయి. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎన్‌డీఆర్‌ఎఫ్‌ సిబ్బందితో కలిసి చెరువులో గాలించారు. సాయంత్రం అయినప్పటికీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. చేపల వేటకు వెళ్లి చెరువులో గల్లంతయినట్లు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

చేపల వేటకు వెళ్లి.. వ్యక్తి మృతి

పెద్దేముల్: చేపల వేటకు వెళ్లి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని మంబాపూర్‌లో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ కాశీనాథ్‌ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గోకరి రాములు(60) గ్రామస్తులతో కలిసి గురువారం సాయంత్రం శివారులోని చెరువుకు చేపల వేటకు వెళ్లారు. ప్రమాదవశాత్తు ఆయన కాలుజారి నీటిలో మునిగిపోయారు. ఎంతకి బయటకు రాకపోవడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. గజ ఈతగాళ్లతో చెరువులో గాలించగా రాములు మృతదేహం లభ్యమైంది. మృతుని కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.